
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

సిద్దిపేట
3
సోమవారం 16 సెప్టెంబరు 2024


విద్యుద్దీప కాంతుల్లో సూఫియా మసీదు

అంతిమ దైవ ప్రవక్త జీవితం
ప్రపంచానికి శాంతి సందేశం

- నేడు ఈద్ మిలాద్ ఉన్ నబీ
- ముస్తాబైన ప్రార్థనా మందిరాలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 15: మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా జిల్లాలోని మసీదులు అందంగా ముస్తాబయ్యాయి. సిద్దిపేట పట్టణంలోని గద్ద బొమ్మ చౌరస్తా వద్దనున్న సుఫియా మసీదు, ముర్షద్ గడ్డ వద్దనున్న మసీదుకు కలర్‌ఫుల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇస్లాం మతాన్ని స్థాపించిన చివరి ప్రవక్త పుట్టినరోజునే మిలాద్ ఉన్ నబీ చేసుకుంటారు. నేడు ఈద్ సందర్భంగా ఉదయం నుంచే ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. నేటి రాత్రి జాగరణ (జాగ్నెకిరాత్) చేస్తారు. ఖురాన్ పఠిస్తారు. ముఖ్యంగా ప్రవక్త జీవితం, బోధనలతో ముడిపడి ఉన్న భాగాలను ప్రత్యేక శ్రద్ధతో చదువుతారు.

సమాజసేవకు ముందుకు రావాలి
- ఉబెదుల్ రెహమాన్, సుఫియా మసీదు ఇమామ్



పరిపూర్ణమైన అనుసరణ, విధేయతను మీ జీవితంలో భాగం చేసుకోవాలి. మన హృదయాలు ప్రేమతత్వంతో నిండి ఉండాలి. మన తోటివారికి సహాయం చేసే గుణం అలవర్చుకోవాలి. జాలి, కరుణ కలిగి ఉండాలి. దైవభీతితో సన్మార్గంలో నడుచుకున్నప్పుడే ప్రవక్త మధ్యవర్తిత్వంతో మనం అల్లా ఆశీర్వాదం పొందుతాం.

మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు : హరీశ్‌రావు




మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ ముస్లింలకు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహ్మద్ ప్రవక్త జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడుస్తూ ఆయన బోధనలను సార్థకం చేయాలన్నారు.



సమస్త సమాచార వేదిక 5
యూడైస్ ప్లస్
- విద్యార్థులు, టీచర్లు, వసతుల వివరాలన్నీ ఒకేచోట
- దీని ఆధారంగానే పాఠశాలల ప్రగతికి ప్రణాళికలు
- ఈ నెలాఖరులోగా వివరాల నమోదుకు చర్యలు

ప్లీజ్..ఒక్కఛాన్స్

ఒక్కొక్కటిగా జిల్లాలోని నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తుండడంతో కాంగ్రెస్ శిబిరంలో ఉత్సాహం నెలకొంది. పదేళ్ల పాటు పదవులకు దూరమైన వారంతా నేడు తెరమీదకు వస్తున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నామని కొందరు.. ప్రత్యర్థి పార్టీలో ఇమడలేక కాంగ్రెస్ కండువా కప్పుకున్నామని ఇంకొందరు పదవుల రేసులో ఉన్నారు. తాజాగా గజ్వేల్, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన కార్యవర్గాలను నియమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని ఇతర మార్కెట్లు, దేవాలయాలతో పాటు కీలకమైన గ్రంథాలయ సంస్థ, సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పదవులను ఆశించే వారి సంఖ్య పెరుగుతోంది.



- నామినేటెడ్ పదవుల కోసం ప్రదక్షిణలు
- ఇప్పటికే గజ్వేల్, చేర్యాల మార్కెట్ కమిటీల నియామకం
- మరో 11 వ్యవసాయ మార్కెట్లపై కసరత్తు
- కొమురవెల్లి సహ ఇతర ఆలయాల పోస్టులకూ పోటీ
- సుడా, గ్రంథాలయ సంస్థల చైర్మన్‌గిరీపై పలువురి కన్ను
- సుమారు 300 మంది కాంగ్రెస్ నేతలకు అవకాశం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, సెప్టెంబరు 15 : సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలతోపాటు జనగామ, మానకొండూరు నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాలున్నాయి. హుస్నాబాద్, మానకొండూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. మిగితా నాలుగు చోట్లా బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుపొందారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో నామినేటెడ్ పదవులన్నీ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకే దక్కాయి. వీరి స్థానంలో ఇప్పుడు పదవులన్నీ కాంగ్రెస్ శిబిరానికి సొంతం కాబోతున్నాయి.

మార్కెట్ కమిటీలకు పోటీ..
జిల్లాలో సిద్దిపేట, చిన్నకోడూరు, నంగునూరు, దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట, గజ్వేల్, వంటిమామిడి, చేర్యాల, హుస్నాబాద్, కోహెడ వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. గజ్వేల్, చేర్యాల మార్కెట్లకు ఇటీవలే కొత్త కమిటీలను నియమించారు. ఇంకా 11 మార్కెట్లకు నూతన కార్యవర్గాలను నియమించాల్సి ఉంది. ఆయా మార్కెట్లకు సంబంధించిన రిజర్వేషన్లను సైతం కేటాయించారు. హుస్నాబాద్, కోహెడ మార్కెట్ పదవుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ కసరత్తు చేస్తున్నారు. ఇక సిద్దిపేట నియోజకవర్గంలోని మూడు మార్కెట్లపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. దుబ్బాక నియోజకవర్గంలోని 4 మార్కెట్లకూ పోటీ తీవ్రంగా ఉంది. కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇక గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రధానమైన వంటిమామిడి మార్కెట్ కమిటీ కోసం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఒక్కో మార్కెట్ కమిటీలో చైర్మన్‌తోపాటు 10మందికి పైగానే డైరెక్టర్లు ఉంటారు. ఈ లెక్కన 12 మార్కెట్లకు సుమారు 150 మంది కాంగ్రెస్ నేతలకు అవకాశాలు దక్కనున్నాయి.



ఆలయ కమిటీలకు ప్రతిపాదనలు
జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలో ఉన్న పలు ఆలయాలకు నూతన కమిటీలను నియమించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ పోస్టులకు కూడా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పేర్లనే నామినేట్ చేయనున్నారు. ప్రధానంగా కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి ఆలయ కార్యవర్గం కోసం తీవ్రస్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. గొల్లకుర్మలకే ఇవ్వాలని ఒక వర్గం.. ఇతరులకు ఇవ్వాలని మరో వర్గం కోరుతున్నాయి. కీలకమైన ఆలయం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి సైతం కొత్త కమిటీపై దృష్టిసారించినట్లు తెలిసింది. అదే విధంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రధానమైన కొండపోచమ్మ ఆలయం, నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ ఆలయం, సిద్దిపేట నియోజకవర్గంలోని కోటిలింగాల, బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం, సంతోషిమాత, వెంకటేశ్వర స్వామి, దుబ్బాక నియోజవర్గంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయం, రేకులకుంట మల్లిఖార్జునస్వామి దేవాలయాల కమిటీలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. వీటితోపాటు మరిన్ని ఆలయా లున్నాయి. అన్నింటా చైర్మన్లు, డైరెక్టర్లుగా పదవులను కేటాయిస్తే 100 మందికి పైగానే సర్దుబాటు చేసే అవకాశం ఉంటుంది.

ఈ పదవులపై ఆసక్తి..
సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిపై పలువురు ముఖ్యనాయకులు దృష్టిపెట్టారు. ప్రొటోకాల్, వేతనం, ఇతర అలవెన్సులు ఉన్నందున రాష్ట్రస్థాయి పదవుల్లో అవకాశం దక్కని నేతలు ఈ పదవికై ఆరాటపడుతున్నారు. ఇక సిద్దిపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవుల తర్వాతి స్థానంలో ఉన్న 'సుడా' చైర్మన్ పోస్టును నామినేటెడ్ విధానంలోనే ఎంపిక చేస్తారు. దీనికి సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలంతా పోటీపడుతున్నారు. సీఎం స్థాయి వరకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆశీస్సుల కోసం ఆరాటపడుతున్నారు. ఎవరికివారే ఈ పదవి తమకే వస్తుందనే ధీమాతో కనిపిస్తున్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సిందే. అదే విధంగా ఆత్మ కమిటీలు, ఈజీఎస్ కౌన్సిల్ సభ్యులు, మానిటరింగ్ కమిటీలు, ఆర్టీఏ మెంబర్లు, విజిలెన్స్ మెంబర్లు తదితర పోస్టులకూ పోటీ నెలకొన్నది.

ఎన్నికల జాప్యంతో తెరమీదకు..
స్థానిక ఎన్నికల్లో జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల్లో బరిలో ఉండేందుకు కాంగ్రెస్ నేతలు నడుం బిగించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో తమకే అవకాశం ఉంటుందనే ఆకాంక్షతో ఉన్నారు. అయితే ఎన్నికల్లో పోటీచేసిన తర్వాత గెలుపు సంగతి పక్కనబెడితే ఓడిపోయిన వారు మళ్లీ నామినేటెడ్ పదవులను ఆశించే అవకాశం లేకపోలేదు. అంతే కాకుండా ముందే పదవులు అప్పగిస్తే స్థానిక ఎన్నికల్లో గ్రూపు రాజకీయాలు, వేరు కుంపట్లు ఉంటాయని భావించారు. అందుకే ఎన్నికలైన తర్వాతే నామినేటెడ్ పదవులను భర్తీ చేయడానికి యోచించారు. కానీ ఇప్పటికే పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నాయి. తాజాగా స్థానిక ఎన్నికల నిర్వహణకు హైకోర్టును 3 నెలల సమయాన్ని ప్రభుత్వం కోరింది. కులగణన ముగిసి రిజర్వేషన్లు అమలుచేసి ఎన్నికలను నిర్వహించాలంటే మరో 6నెలలు కావొచ్చని అంచనా వేస్తున్నారు. అప్పట్లోగా ఆసక్తి ఉన్న సీనియర్లు, పార్టీ దృష్టిలో ఉన్న నేతలకు నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పిస్తారనే ఆశలు పెట్టుకుని ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

నిమజ్జనానికి వేళాయే

- పటిష్ఠ బందోబస్తుకు చర్యలు
- ఫ్లడ్ లైట్లు, క్రేన్లు, బారికేడ్ల ఏర్పాటు
- రెండు రోజుల పాటు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు
- జియో ట్యాగింగ్ ద్వారా శోభాయాత్ర పర్యవేక్షణ

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 15: అత్యంత వైభవోపేతంగా కొనసాగిన వినాయక నవరాత్రులు చివరి అంకానికి వచ్చాయి. ఆదివారం రాత్రి పూజతో నవరాత్రులు పూర్తవుతాయి. ఇప్పటికే ముందుస్తుగా అనుమతి తీసుకున్న గణనాథులు నిమజ్జనానికి కదిలాయి. ఆటపాటలు, కోలాటాల నృత్యాల నడుమ గణపయ్య శోభాయాత్ర నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 2,989 విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆదివారం నుంచే నిమజ్జనాలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 443 విగ్రహాల నిమజ్జనానికి పోలీసుల అనుమతి తీసుకున్నారు. సోమవారం 427 విగ్రహాలు నిమజ్జనానికి తరలనున్నాయి. ఇక ఎక్కువగా మంగళవారం రోజున సుమారు 2వేల విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతాలన్నీ సీసీ కెమెరాల నిఘాలో పెట్టారు. శోభాయాత్ర వెళ్లే రూట్లతో పాటుగా నిమజ్జన ప్రదేశాలు సిద్దిపేట కోమటి చెరువు, ఎర్ర చెరువు, గజ్వేల్‌లోని పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్‌లోని ఊరచెరువు, దుబ్బాక రామసముద్రం చెరువు, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, చేర్యాలలోని కుడి చెరువుల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. సిద్దిపేటలో శోభాయాత్ర రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. సిద్దిపేట కోమటి చెరువు బైపాస్ రోడ్డు వైపు నిమజ్జనానికి ఏర్పాట్లుచేశారు. ఫ్లడ్ లైట్లు, క్రేన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో గజ ఈతగాళ్లను, ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉంచారు. రూరల్ పోలీస్ స్టేషన్ వైపు నుంచి, కోటి లింగాల ఆలయం వైపు నుంచి, డిగ్రీ కళాశాల, హౌజింగ్ బోర్డు, విక్టరీ చౌరస్తా, ఎన్సాన్‌పల్లి రోడ్డు వైపు నుంచి వచ్చే గణనాథులను నిమజ్జనం పాయింట్ చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. శోభాయాత్ర సాగే దారులవెంట అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఇప్పటికే వినాయక మండపాల వద్ద పోలీసుశాఖ వారు జియో ట్యాగింగ్ చేశారు. ఈ జియో ట్యాగింగ్ వల్ల నిమజ్జనానికి వెళ్లేటప్పుడు ఏ రూట్‌లో వెళ్తున్నారు..? ఎక్కడి వరకు వచ్చారు అనే విషయం పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తారు. ఊరేగింపులో వాహనం ఆగిపోతే పోలీసులు స్పందించి వెంటనే ఆ ప్రదేశానికి చేరుకోవడానికి సులువుగా ఉంటుంది.


కోమటిచెరువు వద్ద పూర్తయిన నిమజ్జన ఏర్పాట్లు

సిద్దిపేటలో ట్రాఫిక్ డైవర్షన్
సిద్దిపేటలో సోమవారం మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అందరూ సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. తొగుట, ఎన్సాన్‌పల్లి నుంచి వచ్చే వాహనాలు బైపాస్ కుడి వైపు నుంచి బీజేఆర్ చౌరస్తా మీదుగా పట్టణంలోకి వెళ్లాలి. మెదక్ రామాయంపేట, దుబ్బాక, రూరల్ పోలీస్ స్టేషన్, అంబేడ్కర్ చౌరస్తా, సిద్దిపేట టౌన్‌కు వచ్చే వాహనాలు సిద్దిపేట బైపాస్ రోడ్డు, ఎల్లమ్మ ఆలయం, వేములవాడ కమాన్, నర్సాపూర్ చౌరస్తా, కుంకుమ మిల్లు రాజీవ్ రహదారి మీదుగా వెళ్లాలి. నాగదేవత ఆలయం చౌరస్తా నుంచి సిద్దిపేటకు వచ్చే వాహనాలు ఎల్లమ్మ ఆలయం నుంచి వేములవాడ కమాన్ మీదుగా పట్టణంలోకి రావాలని పోలీసులు సూచిస్తున్నారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటిస్తూ సహకరించాలని పోలీసులు కోరారు.


అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించిన సిబ్బంది

సజావుగా జరిగేలా సహకరించాలి : సీపీ
ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిమజ్జన శోభయాత్ర జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీపీ అనురాధ సూచించారు. నిమజ్జనం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వినాయక మండపాల నిర్వాహకులు తాము ఎంచుకున్న తేదీల్లోనే నిమజ్జనం చేసుకోవాలని చెప్పారు. శోభాయాత్రలో బాణసంచా కాల్చొద్దని చెప్పారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. భక్తి పాటలతో మాత్రమే ఊరేగింపు నిర్వహించాలని, ఇతరులపై రంగులు చల్లకూడదని చెప్పారు. మద్యం సేవించవద్దని, చెరువులు నిండుగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచంచారు.


కోమటిచెరువు వద్ద బుజ్జి గణపయ్యల నిమజ్జనం


గణపయ్యను తీసుకెళ్తూ..


సిద్దిపేటలో శోభాయాత్రలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు


సిద్దిపేటలోని పటేల్‌పురలో పార్వతీమాత ఫ్యామిలీయూత్ అసోసియేషన్ అధ్వర్యంలో గణనాథుడిని రూ.11 లక్షల కరెన్సీ నోట్లు, నాణేలతో అలంకరించి లక్ష్మీపూజ నిర్వహించారు.

నిమజ్జనానికి ఇబ్బందులు
తలెత్తకూడదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 15: వినాయక నిమజ్జన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన హుస్నాబాద్‌లో ఎల్లమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు వద్ద లైటింగ్ సిస్టం, బారీకేడ్లు, ఈతగాళ్లను నియమించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్ పర్సన్ అనిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, తదితరులు ఉన్నారు.


హుస్నాబాద్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి


కటాక్షించని కల్యాణలక్ష్మి

- పెండింగ్‌లో షాదీముబారక్ చెక్కులు
- ఆరునెలలుగా లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

గజ్వేల్, సెప్టెంబరు 15: గజ్వేల్ డివిజన్ పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆరు నెలలుగా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు డివిజన్ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మూడు నుంచి నాలుగు నెలలకు ఓ సారి అందజేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. దీంతో చెక్కులు ఇవ్వాలంటూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా లబ్ధిదారులు తిరుగుతున్నారు. చెక్కులు వస్తాయా... రావా అనే మీమాంసలో నలిగిపోతున్నారు. ఇప్పటికే మంజూరైన చెక్కులకు సంబంధించిన వ్యాలిడిటీ సైతం ముగిసి మరోసారి చెక్కులను రెన్యూవల్ చేయించినట్లు తెలుస్తుంది.

గతంలో అలా... ప్రస్తుతం ఇలా
గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం కావడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న హరీశ్‌రావు చొరవ తీసుకుని చెక్కులను లబ్ధిదారులకు అందజేసేవారు. ప్రతిసారి మూడు నుంచి నాలుగు నెలలకు ఓ సారి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు చెక్కులను అందజేసే వారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ నియోజకవర్గానికి దూరంగా ఉండడంతో చెక్కుల విషయమై పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఇక అటు అధికార కాంగ్రెస్ పార్టీలో సైతం జిల్లాలో ఎవరికి ప్రొటోకాల్ లేకపోవడంతో చెక్కులు ఎవరి ద్వారా పంపిణీ చేయించాలో.. అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై చొరవ తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దాదాపుగా 400కు పైగా పెండింగ్
సిద్దిపేట నియోజకవర్గానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడంలో అధికారులు చొరవ తీసుకోకపోవడంతో సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని కోర్టును ఆశ్రయించి చెక్కులను లబ్ధిదారులకు అందేలా చేశారు. కానీ గజ్వేల్ నియోజకవర్గంలో అలా ప్రజల కోసం ఆలోచన చేసే నాయకులు అధికార, ప్రతిపక్ష పార్టీలో లేకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన దాదాపుగా 400కు పైగా చెక్కులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ విషయమై ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేయాలని వారు కోరుతున్నారు.



ఘనంగా శ్రవణ నక్షత్ర పూజలు 5

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

మనోహరాబాద్, సెప్టెంబరు 15: మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలోని ధనలక్ష్మీ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం పరిశ్రమ లోపల కార్మికులు పని చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో పరిశ్రమ సిబ్బంది వెంటనే అప్రమత్తమై నర్సాపూర్ ఫైర్ సేఫ్టీ సిబ్బందికి సమాచారం అందించారు. గంట తరువాత ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ పరిశ్రమలో లాజిస్టిక్ ప్లాస్టిక్, ఫర్నీచర్‌ను తయారు చేస్తారు. అప్పటికే చాలావరకు వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కార్మికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సుమారు రూ.30 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని పరిశ్రమ యజమాని రాము తెలిపారు. పరిశ్రమ నిర్వాహకుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు..



ఘటనా స్థలంలో కార్మికులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్



వినాయక నిమజ్జనాల సందర్భంగా జహీరాబాద్‌కు వచ్చిన పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ రామ్మోహనరెడ్డి

గణనాథుడి నిమజ్జనోత్సవాలకు

అదనపు పోలీసు బలగాలు

● జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి

జహీరాబాద్,సెప్టెంబరు15 : జహీరాబాద్ పట్టణంలో చేపట్టబోయే వినాయక నిమజ్జన ఉత్సవాలకు అదనపు పోలీసు బలగాలను రప్పించినట్లు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి తెలిపారు. ఆదివారం రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అదనపు పోలీసు బలగాలతో ఆయన సమావేశమై పలు సూచనలు, సలహాలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఉత్సవాలు ప్రశాంతవాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. పోలీసులు, ఇతర శాఖల అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు పోలీసు సిబ్బంది ఎక్కడెక్కడా విధులను నిర్వహించాలో కేటాయించారు. వీరంతా నాలుగురోజులపాటు జహీరాబాద్‌లోనే ఉంటూ నిమజ్జనాలకు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ. కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్, సెప్టెంబరు 15: మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన శివయ్య(58) మద్యానికి బానిసై ఆదివారం ఉదయం ఇంటి వద్ద శాలువాతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబసభ్యులు గమనించి గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.సైదా తెలిపారు.

విశిష్ట విప్లవానికి దిక్సూచి సీతారాం ఏచూరి

జహీరాబాద్,సెప్టెంబరు15: విశిష్టవిప్లవానికి సీతారాం ఏచూరి దిక్సూచి అని సీపీఎం కార్యదర్శివర్గ జిల్లా నాయకులు రాంచందర్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పదేశభక్తి కలిగి ప్రజలసమస్యలపై నిరంతరంపోరాటం చేసిన మహనీయుడు సీతారాం ఏచూరి అన్నారు. కార్యక్రమంలో నేతలు నర్సయ్య, సలీముద్దిన్, నర్సింహులు, నరేష్, తుల్జారాం, రాజు, ఫహీం, రాజేష్, ముజాయత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేరదు.. ఆకలి తీరదు..

- వాగ్ధానాలకే పరిమితమైన మధ్యాహ్న భోజనం
- జూనియర్ కళాశాల్లో అమలుకు నోచుకోని పథకం
- పస్తులతో పాఠాలు వింటున్న వైనం
- జిల్లాలో 16 ఇంటర్ కళాశాలలు.. 5 వేల మంది విద్యార్థులు



మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15 : సర్కారు బడుల్లో మాదిరిగా సన్నరకం బియ్యంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామన్న ప్రభుత్వ హామీ నెరవేరడం లేదు. ఉదయమే ఇంటి నుంచి కళాశాలలకు వచ్చి చదువుకునే దూరప్రాంతాల విద్యార్థులు మధ్యాహ్నం తినకుండానే పాఠాలు వింటున్నారు. కొంతమంది ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుంటుండగా.. మరికొందరు నీరసంగా పాఠాలు వింటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఏటా హామీ ఇవ్వడం.. ఆచరణలో పెట్టకపోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం కూడా మారటంతో దీని గురించి మాట్లాడే వారు లేకుండా పోయారు.

దూరప్రాంత విద్యార్థులకు నిరాశే...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతుంటారు. కిలోమీటరు మొదలు కొని 20 కిలోమీటర్ల దూరం నుంచి కూడా కళాశాలలకు వచ్చేవారున్నారు. ఉదయం ఇంట్లో భోజనం సిద్ధం కాక లంచ్ బాక్స్‌లు తెచ్చుకోవడం లేదు. దాంతో మధ్యాహ్నం చాలా మంది ఖాళీ కపుడుతోనే కాలం నెట్టుకొస్తున్నారు. ఆకలితో చదువుపై తగిన దృష్టిని పెట్టలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వీరికోసం మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తామని నాలుగేళ్ల కింద అప్పటి ప్రభుత్వం ప్రకటించినా.. అమలుకాలేదు. ఇటీవల ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందేమోనని భావించిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. హామీ నేటికీ అమలు చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రయోజనం..

జిల్లావ్యాప్తంగా 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీ య సంవత్సరంలో 5040 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే వేలాది మంది పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

తక్షణమే అమలు చేయాలి..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని ఇచ్చిన హామీని ఎప్పుడూ అమలు చేస్తారో తెలియడం లేదు. ఎన్నో వేదికలు, సమావేశాల్లో మంత్రులు, ఉన్నతాధికారుల హామీలు బుట్టదాఖలు కావడం చూస్తుంటే పేద విద్యార్థులపై పభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో ఊహించుకోవచ్చు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

- దినాకర్, ఏఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి

ఘనంగా శ్రవణ నక్షత్ర పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వర్గల్, సెప్టెంబరు 15 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేతులైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు, గణపతి హోమం, లక్షతులసి అర్చన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్దాంతి ఆధ్వర్యంలో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ అన్న ప్రసాదాలను అందజేశారు. ఇక్కడున్న లక్ష్మీగణపతి ఆలయంలో వినాయక నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం వినాయకుడిని నిమజ్జన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వరుసగా ఢీకొన్న వాహనాలు







ధ్వంసమైన కార్లు, బైకు

కొండపాక, సెప్టెంబరు 15 : కొండపాక మండలం దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై ఒకదానికొకటి వాహనాలు వరుసగా ఢీకొట్టుకున్నాయి. దాంతో వాహనాలు ధ్వంసం కాగా ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే హైదరాబాదు నుంచి సిద్దిపేటకు వెళ్తున్న కారు దుద్దెడ శివారులో సడన్ బ్రేక్ వేయగా వెనకనే ఉన్న కారు ముందు కారుకు ఢీ కొట్టి డివైడర్‌కు అటువైపు రోడ్డుకు దూసుకెళ్లి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొట్టింది. ఇది గమనించిన బస్సు డ్రైవర్ పక్కకు తీసుకుంటుండగా బస్సు పక్కనే ఆటోకు ఢీ కొట్టింది. ఆటో ఆ పక్కన ఉన్న మోటార్ సైకిల్ కు ఢీ కొట్టింది. ఇలా వరుస వాహనాలు ఢీ కొట్టుకోవడంతో రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

వర్గల్, సెప్టెంబరు 15 : హత్య చేశాడన్న కోపంతో ఓ కుటుంబ సభ్యులు బెయిల్‌పై వచ్చిన వ్యక్తిని చితకబాదడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో తొమ్మిది మందిపై గౌరారం పోలీసులు హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆదివారం వివరాలను వెల్లడించారు. వర్గల్ మండలం మినాజీపేట గ్రామానికి చెందిన బానపురం యాదగిరి, అదే గ్రామానికి చెందిన కీసర ఆనంద్ ఇద్దరు కలిసి ఐదు నెలల క్రితం మెదక్ జిల్లా తూప్రాన్ సమీపంలో మద్యం సేవిస్తుండగా ఇద్దరూ డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. మద్యం మత్తులో బానపురం యాదగిరి కర్ర తీసుకుని ఆనంద్‌ను కొట్టడంతో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయమై తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి బానపురం యాదగిరిని రిమాండ్‌కు పంపించారు. రెండునెలల క్రితం బెయిల్‌పై వచ్చిన యాదగిరి భార్యాపిల్లలతో కలిసి మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బాలాజీనగర్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 13న శుక్రవారం రాత్రి 10.30 చిట్టి డబ్బులు ఇవ్వడానికి యాదగిరి మినాజీపేట గ్రామానికి వచ్చి అతని తల్లి చంద్రవ్వతో మాట్లాడుతుండగా అప్పటికే అతనిపై కోపంతో ఉన్న కీసర ఆనంద్ కుటుంబ సభ్యులు అతడిపై రాళ్లతో దాడిచేస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం వరకు లాక్కోని వెళ్లారు. దీంతో తీవ్ర గాయాలపాలైన యాదగిరిని ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. యాదగిరి తల్లి చంద్రవ్వ ఫిర్యాదు మేరకు కీసర ఆనంద్ కుటుంబ సభ్యులైన అరుణ్‌కుమార్, ప్రశాంత్, నాగరాణి, పాపమ్మ, రమాదేవి, నర్సింహులు, నగేశ్, రమేశ్, వెంకటేశ్‌లపై హత్యాయత్నం, ఎస్సీఎస్టీ కేసులు నమోదు చేశారు. ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అప్పులు తీర్చలేక గృహిణి ఆత్మహత్య



జయమ్మ (ఫైల్)

శివ్వంపేట, సెప్టెంబరు 15 : కొడుకు అనారోగ్యానికి చేసిన అప్పు తీర్చలేక గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొంతాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన బుడిగే జయమ్మ (50) కొడుకు శ్రీకాంత్ గుండె చికిత్సకు కోసం పెద్ద ఎత్తున అప్పులు చేసింది. అవి తీర్చే మార్గం కానరాక ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది పొలం వద్ద చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కొడుకు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు. కాగా, అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్, సెప్టెంబరు 15: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గజ్వేల్ మండలం అక్కారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బుడిగె స్వామి(31) గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై ఈ నెల 11న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన రమేశ్

మాసాయిపేట సెప్టెంబరు 15గ్రా :రోడ్డు దాటుతున్న యువకుడిని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం నడిమి తండా కు చెందిన మెగావత్ రమేశ్ (34) చెట్ల తిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ రాయల్ ట్రావెల్స్ బస్సు అతి వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం కొంపల్లి శిఖర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

నిమజ్జన బందోబస్తుకు శిక్షణ కానిస్టేబుళ్లు

నారాయణఖేడ్, సెప్టెంబరు 15: ఖేడ్ మున్సిపాలిటీతో పాటు మండల కేంద్రాలు, పెద్ద గ్రామాల్లో వినాయక నిమజ్జనాల కోసం వివిధ జిల్లాల్లో శిక్షణ తీసుకుంటున్న దాదాపు 100 శిక్షణ లో ఉన్న కానిస్టేబుళ్లు ఖేడ్‌కు పంపారు. బందోబస్తుకు వారితో పాటు డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందిని వినియోగించనున్నారు. వారికి ఖేడ్ సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో వసతిని కల్పించారు. ఆదివారం స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి వినాయక శోభాయాత్రలు, చెరువుల వద్ద బందోబస్తు లకు సంబంధించిన అంశాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఆయన వెంట ఖేడ్, నాగల్‌గిద్ద ఎస్ఐలు విద్యాచరణ్‌రెడ్డి, సాయిలు తదితరులు ఉన్నారు.



ట్రైనీ కానిస్టేబుళ్లకు సూచనలిస్తున్న పోలీస్ అధికారులు

చెరువులో పడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు

దుబ్బాక, సెప్టెంబరు 15 : ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన దుబ్బాక మండలం అప్పనపల్లిలో చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కొమురవెల్లి మండలం గౌరాయిపల్లి గ్రామానికి చెందిన బండి నవీన, యాదగిరిల కుమారుడు సాయి(7) తల్లితో కలిసి అప్పనపల్లిలోని అమ్మమ్మగారి ఇంటికి దేవుని పండుగకు వచ్చాడు. ఆదివారం కుటుంబీకులు బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్లగా బాలుడు వెంటవెళ్లాడు. ఈ తరుణంలో సాయి చెరువుకట్టపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. కాసేపటికి తల్లి నవీనాకు కొడుకు కనింపించకపోవడంతో తన తమ్ముడికి ఫోన్ చేసింది. అక్కడి చేరుకున్న అతడు చెరువులోకి దూకి బాలుడి మృతదేహన్ని వెలికితీశారు. సాయి మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. తల్లి నవీనా ఫిర్యాదుమేరకు దుబ్బాక ఎస్ఐ గంగరాజు కేసునమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాయిలపూర్ విద్యార్థులు



ఎంపికైన రాయిలపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

కౌడిపల్లి, సెప్టెంబరు 15: సంగారెడ్డి జిల్లాలోని బానురులో ఆదివారం జరిగిన కరాటే అండర్ 14 కాటాస్ పోటీల్లో మండలంలోని రాయిలపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ధనుశ్రీ, పల్లవి, భావన గోల్డ్ మోడల్ సాధించగా, అర్చన, కృష్ణవేణి సిల్వర్ మోడల్, మనోజ్‌రాజ్‌కు మెడల్స్ సాధించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తా చాటిన కాళ్లకల్ చిన్నారులు..



మెడల్స్, సర్టిఫికెట్లతో కాళ్లకల్ గ్రామ చిన్నారులు

మనోహరాబాద్, సెప్టెంబరు 15: కరాటే టోర్నమెంట్‌లో కాళ్లకల్ గ్రామానికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచారు. పటాన్‌చెరులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కాళ్లకల్ నుంచి 30 మంది పాల్గొని.. 18 మంది గోల్డ్, 8 మంది సిల్వర్, 4 మంది బ్రౌన్జ్ మెడల్స్ సాధించారు. ఇందులో చాంపియన్ షిప్ విన్నర్ రేశ్విత, జ్యోతి, రవి కుమార్, కరాటే మాస్టార్లు నత్తి మల్లేష్, లక్ష్మణ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

రాణించిన సాయికృప విద్యార్థులు..



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కొండపాక, సెప్టెంబరు 15 : కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన సాయి కృప హై స్కూల్ విద్యార్థులు కరాటేలో సత్తా చాటారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోటీల్లో పాఠశాలకు చెందిన అభిజ్ఞ, నిరూపంగౌడ్ గోల్డ్ మెడల్, అవంతిక సిల్వర్ మెడల్ గెలుచుకోగా, అస్మిత కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నది. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వనజ , పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రపంచ దేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత



కాల్వ సుజాతను సన్మానిస్తున్న మహిళలు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 15: ప్రపంచ దేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు దక్కుతున్నదని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాభావం, దాతృత్వం ఆర్యవైశ్యులకే సొంతమన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్ గుప్త, శ్రీనివాస్, సీనియన్ నాయకులు వెంకటయ్య, మహేందర్, బాలనారాయణ, చంద్రశేఖర్, నాగరాజు, కొండలు, వెంకటేశం, అమరరాము, శ్రీనివాస్, రామ్‌నివాస్, పెద్ది శంకర్‌గుప్త, పెద్ది శ్రీనివాస్, కిరణ్, ఆర్యవైశ్య నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కిషన్‌రావు పోరాటం చిరస్మరణీయం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



డాక్టర్ కిషన్‌రావు సంతాప సభలో ప్రసంగిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, సెప్టెంబరు 15: జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో రసాయన పరిశ్రమల కాలుష్య నివారణకు డాక్టర్ కిషన్‌రావు చేసిన పోరాటాలు చిరస్మరణీయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కొనియాడారు. ఆదివారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన కిషన్‌రావు సంతాప సభకు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో పరిశ్రమలు వదిలే కాలకుట విశంలాంటి వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతింటున్న దారుణాలను బయటి ప్రపంచానికి మొట్ట మొదట తెలియజేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన చేసిన పోరాటాల ఫలితంగా సుప్రింకోర్టులో కాలుష్య పీడిత రైతులకు నష్టపరిహారం అందిందన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త డా.పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ కాలుష్యంపై డాక్టర్ కిషన్‌రావు చేసిన ఉద్యమాలు అంతర్జాతీయ మీడియా సంస్థలను సైతం ఆకర్శించాయన్నారు. సభలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ ఆర్‌టీఐ కమిషనర్ దిలీప్‌రెడ్డి, పర్యావరణవేత్తలు ప్రొఫెసర్ నరసింహారెడ్డి, శిల్పకృష్ణ, మాజీ జడ్‌పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అంజిరెడ్డి, పాషమైలారం పరిశ్రమల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, తెలంగాణ ప్రాంత మహా సద్భావ్ ప్రముఖ్ రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు నరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, నాయకులు రవి, భిక్షపతి, యాకూబ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ గుప్త, శేషాద్రి, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

సంఘటితంగా ఉద్యమిస్తే సీపీఐకి పూర్వ వైభవం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మహ్మదాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబర్ 15 : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు వారసులు కమ్యూనిస్టులేనని, నాడు సీపీఐ పోరాటాల ఫలితంగానే తెలంగాణను భారత దేశంలో విలీనం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లోని తెలంగాణ సాయుధ పోరాట అమరులు అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి స్మారక ఘాట్ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వెంకటరెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలన్నారు. పార్టీ కార్యకర్తలందరూ సంఘటితంగా ఉద్యమించి సీపీఐకి పూర్వ వైభవం తేవాలన్నారు. గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం, ఎడల వనేష్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ సిద్దిపేట, కరీంనగర్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి మహ్మదాపూర్‌లోని అమరుల ఘాట్ వద్ద జిల్లా కార్యదర్శులు మంద పవన్, మర్రి వెంకటస్వామి నివాళులర్పించారు. ఏటా సీపీఐ నాయకత్వం ఒకే తాటిపై విమోచన వేడుకలు నిర్వహించే వారు. కానీ ఈసారి జిల్లా, మండల నాయకత్వాలు వేర్వేరుగా నిర్వహించడం చర్చనీయ అంశంగా మారింది.

హుస్నాబాద్‌లో.

హుస్నాబాద్ టౌన్/హుస్నాబాద్, సెప్టెంబరు 15: తెలంగాణ రైతంగ సాయుధ పోరాట వారోత్సవాలను హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలో పోరాట యోదుడు అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ కూడా అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యులు పొన్నగంటి కేదారి, కోయ్యడ సృజన్ కుమార్, రాష్ట్ర సమితి మాజీ సభ్యులు దయానంద రెడ్డి, నేతలు ఎడల వనేష్, జేరిపోతుల జనార్దన్ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

వియత్నాం దేశ కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు స్టడీ టూర్‌కు వెళ్లివచ్చిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డికి సత్తా, స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్త సమాచార వేదిక యూడైస్ ప్లస్



శిక్షణ ఇస్తున్న ఎంఐఎస్ సురేందర్

- విద్యార్థులు, టీచర్లు, వసతుల వివరాలన్నీ ఒకేచోట
- దీన్ని ఆధారంగానే పాఠశాలల ప్రగతికి ప్రణాళికలు
- ఈ నెలాఖరులోగా వివరాల నమోదు పూర్తికి చర్యలు



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కొండపాక, సెప్టెంబరు 15 : పాఠశాలల ప్రగతి యూడైస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్ కీలకం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆర్థిక, వసతుల వివరాలు ఇందులో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సిందే. ఇందులో భాగంగా ఈ నెలాఖరులోగా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల సంఖ్య తేల్చేందుకు చర్యలు చేపట్టారు. యూడైస్ పోర్టల్‌లో సర్వం సమాచారాన్ని నిక్షిప్తం చేస్తుండగా.. దీన్ని ఆధారంగా విద్యాశాఖ ఏటా ప్రణాళికలు రూపొందించనుంది. పాఠ్య రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితరవాటికీ యూడైస్ ఆధారంగానే నిధులు కేటాయిస్తారు. సిద్దిపేట జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రాథమిక పాఠశాలలు 629, ప్రాథమికోన్నత 114, ఉన్నత 219, జూనియర్ కళాశాలలు 47, కేజీబీవీలు 22 , ఆదర్శ పాఠశాలలు 14, గురుకులాలు 36, ప్రైవేట్ పాఠశాలలు 226 ఉన్నాయి. మొత్తం 1307 విద్యాసంస్థల్లో 1.80 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

మూడు గంటలకోసారి అప్‌డేట్

జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు ఇదివరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 2021-22 వరకు యూడైస్‌గా కొనసాగగా.. గత విద్యా సంవత్సరం నుంచి యూడైస్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారం అప్‌డేట్ చేయడం దీన్ని ప్రత్యేకత. ఈ వెబ్‌సైట్‌ను పాఠశాల భౌతిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్స్‌గా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. పాఠశాలకు క్రీడా స్థలం ఉందా, తరగతి గదులెన్ని, ఇంకా అవసరమైనమైన వసతులేమి వంటి వివరాలను ఎప్పటికప్పుడూ అప్‌డేట్ చేస్తున్నారు.

ప్రతి విద్యార్థికీ 'పెన్'..

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న యూడైస్ ప్లస్ పోర్టల్‌లో వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన ప్రతి విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్(పెన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశవ్యాప్తంగా ఏఏ పాఠశాలలో ఏఏ తరగతులు చదివాడు ఖచ్చితంగా తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే పాఠ్యపుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాల పంపిణీ చేస్తుంది. గత ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థుల నామినల్ రూల్స్ కోసమూ యూడైస్ డాటానే పరిగణలోకి తీసుకుంటున్నారు.

టీచర్లకు జాతీయ కోడ్..

విద్యార్థుల మాదిరిగానే ఉపాధ్యాయులకు కూడా ఒక జాతీయ కోడ్ నెంబర్‌ను యూడైస్ కేటాయిస్తుంది. తద్వారా ప్రతి పాఠశాలలో కచ్చితంగా నమోదయ్యే విద్యార్థుల సంఖ్యతోపాటు ఉపాధ్యాయుల సంఖ్య కూడా తెలుస్తుంది. తద్వారా ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి లెక్కించొచ్చు. ఈ విధంగా యూడైస్‌లో నమోదు చేసే వివరాలను అత్యంత గోప్యంగా, ప్రామాణికంగా నిర్వహించడానికి మండల విద్యాధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర సమాచార కార్యాలయం వరకు వివిధ అంచెల్లో సిబ్బందికి శిక్షణ పూర్తిచేశారు. ఈ ప్రాముఖ్యత దృష్ట్యా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠశాలకు సంబంధించిన సమగ్ర వివరాలను యూడైస్ ప్లస్‌లో నిర్ణీత గడువులోపు నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అదేశించారు

శిక్షణా కార్యక్రమాలు...

ఈ వివరాల నమోదును ఎలా చేయాలో ప్రధానోపాధ్యాయులకు జిల్లా, మండల స్థాయిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎంఈవో, పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎంలకు శిక్షణ ముగియగా.. అన్ని పాఠశాలల హెచ్ఎంలకు మండల స్థాయిలో శిక్షణ దాదాపు పూర్తి చేశారు. అన్ని విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు వివరాలను ఈ పోర్టల్‌లో నమోదు చేసి మండల విద్యాధికారి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సంతకంతో జిల్లా విద్యాశాఖకు అందజేయాల్సి ఉంటుంది.

గజ్వేల్‌లో గాయత్రీ మహాయజ్ఞం



ఎమ్మెల్సీ యాదవరెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గజ్వేల్, సెప్టెంబరు 15: గజ్వేల్ పట్టణం ముట్రాజ్‌పల్లి రోడ్డులోని గజ్వేల్ టౌన్ ఫంక్షన్‌హాల్‌లో గజ్వేల్ ఆర్య సమాజం ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ మహాయజ్ఞానికి శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ ఛైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్య సమాజం సభ్యులు వాసవాచారీ, కొండల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేశం తదితరులు హాజరయ్యారు.

ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డికి సన్మానం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 15: గజ్వేల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డిని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. అలాగే సభ్యులు హరినాథ్ గుప్తా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు గుబ్బ శ్రీనివాస్, జగదేవ్‌పూర్ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ మునీర్‌లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆర్య వైశ్య తదితరులు పాల్గొన్నారు.

అతిథి గృహం.. ఆతిథ్యానికి ఆమడదూరం

- విస్తరణ పనులకు ఏడేళ్లు
- నిరుపయోగంగా గెస్ట్‌హౌజ్
- బకాయిలు చెల్లించక కరెంట్ కట్
- అంధకారంలో భవనం



నిరుపయోగంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

దుబ్బాక, సెప్టెంబరు 16: దుబ్బాక డాగ్‌బంగ్లా అంటే నాలుగు జిల్లాల సరిహద్దులో ప్రత్యేక పేరుండేది. వివిధ ప్రాంతాల నుంచి దొరలు, సంస్థానాధీశులు వచ్చి విడిది చేసే ప్రత్యేక భవనం.. అప్పటి నుంచి పాతతరం ఇప్పటికీ డాగ్‌బంగ్లా అనే పిలుస్తారు. అదే స్థలంలో ఆర్‌అండ్‌బీ శాఖ 2001లో అప్పటి మంత్రి దివంగత నేత ముత్యంరెడ్డి రూ.15 లక్షలతో సుందరవదనంగా భవనం నిర్మించి, అతిథి భవనంగా పేరుపెట్టారు. ఆ తరువాత గెస్ట్‌హౌజ్‌గా పిలుచుకునే డాగ్‌బంగ్లా ఇప్పుడు అతిథిలకు ఆతిథ్యం ఇచ్చేందుకు కూడా నోచుకోవడం లేదు. భవనం విస్తీర్ణం పేరుతో జరుగుతున్న పనులు ఏడేళ్లుగా నత్తనడకనే సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో అతిథి గృహం మూలనపడింది. మొదటి అంతస్తు నిర్మాణానికి 2020లో రూ.78 లక్షల నిధులు మంజూరీ చేశారు. రెండు సూట్లతోపాటు మీటింగ్‌హాల్‌ను నిర్మిస్తున్నారు. అయితే ఐదేళ్లుగా రోడ్లు, భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పనులు సక్రమంగా సాగడం లేదు. దీంతో దుబ్బాకకు వచ్చే అతిథులకు ఆతిథ్యం ఇచ్చే అతిథి గృహం వినియోగంలోకి రాకుండాపోయింది.

అంధకారంలో భవనం

మొదటి అంతస్తు నిర్మాణంలో ఉండటంతో కింది అంతస్తును నిరుపయోగంగా మార్చారు. కింది అంతస్తులో రెండు సూట్లు, మీటింగ్‌హాల్, డైనింగ్‌హాల్, లివింగ్ రూంలు వినియోగించాల్సి ఉంది. అయితే కనీసం సమావేశాలు నిర్వహించేందుకు కూడా కరెంటు సరఫరా లేకుండా పోయింది. విద్యుత్‌శాఖ అధికారులు తమకు ఆర్‌అండ్‌బీ శాఖ బకాయిపడిందంటూ కరెంట్ సరఫరా నిలిపివేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడం, నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో రెండేళ్లుగా ఏటా రూ.75 వేల చొప్పున రూ.1.50 లక్షల వరకు బకాయిలు పడ్డారు. రెండేళ్ల నుంచి అతిథి గృహం నిర్వహణ లేకపోయినా పనులకు విద్యుత్ వినియోగం ఎక్కువగా వినియోగించుకోవడంతో కాంట్రాక్టర్ చెల్లించాల్సిన అవసరం కూడా లేకపోలేదని అంటున్నారు. బోరుమోటారు వినియోగించుకుని తీరా బిల్లు చెల్లించకపోవడంతోనే అతిథి గృహం అంధకారంలోకి వెళ్లిందంటున్నారు.

పల్లెకు రాని 'పల్లెవెలుగు'

- విద్యార్థులకు, ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ఉచిత బస్సు ప్రయాణానికి దూరం



బెజ్జంకి మండల కేంద్రానికి వస్తున్న పల్లెవెలుగు బస్సు

బెజ్జంకి, సెప్టెంబరు 15: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల రవాణా సౌకర్యం కోసం ఏర్పాటుచేసిన పల్లె వెలుగు బస్సులు గ్రామాల్లోకి వెళ్లకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ప్రైవేయిట్ వాహనాలను ఆశ్రయించి ప్రయాణాలు సాగిస్తున్నారు. గతంలో ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ గ్రామాల్లో పల్లె వెలుగు బస్సులను ప్రారంభించి సేవలందించింది. కొన్ని గ్రామాల్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అవసరాల నిమిత్తం మండల కేంద్రంతో పాటు, జిల్లా కేంద్రానికి, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. బెజ్జంకి మండలంలో 23 గ్రామాలుండగా.. అందులో కొన్ని గ్రామాల మీదుగానే పల్లె వెలుగు బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. కరీంనగర్ డిపో నుంచి ఉదయం ఒక పల్లె వెలుగు బస్సు రాజీవ్ రహదారి మీదుగా దేవక్కపల్లి, తోటపల్లి, వీరాపూర్, లక్ష్మీపూర్, బేగంపేట, గూడెం గ్రామాల మీదుగా బెజ్జంకి మండల కేంద్రానికి వస్తుంది. మరో పల్లె వెలుగు బస్సు కరీంనగర్ నుంచి బయలుదేరి దేవక్కపల్లి, తోటపల్లి, గాగిల్లాపూర్, దాచారం, ముత్తన్నపేట మీదుగా మండల కేంద్రానికి చేరుకుంటుంది. ఈ బస్సు సర్వీసు వేళలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఉంటున్నాయి. ఇతర సమయాల్లో బస్సులు రాకపోవడంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల్లో భాగంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి దూరమవుతాన్నామని మహిళలు, విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది గ్రామాల మీదుగానే బస్సు సర్వీసులు

మండలంలో 23 గ్రామాలుండగా.. 10 గ్రామాల మీదుగానే బస్సు సౌకర్యం నామమాత్రంగా ఉంది. మిగిలిన 13 గ్రామాల ప్రజలు పల్లెవెలుగు బస్సును ఎరుగరు. పూర్తిస్థాయిలో విద్యార్థులకు, ప్రజలకు ఏ అవసరాలున్నా సిద్దిపేట, కరీంనగర్, హుస్నాబాద్ వెళ్లాలంటే ప్రైవేట్, సొంత వాహనాల మీదనే వెళ్లాల్సి ఉంటుంది. తప్పని పరిస్థితుల్లో వెళ్లాలంటే బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారి వద్దకు వచ్చి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి



మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. మేము పనుల నిమిత్తం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే మా గ్రామం నుంచి రెండు కి.మీ దూరం నడిచి రాజీవ్ రహదారి వద్దకు చేరుకోవాలి. తప్పని పరిస్థితుల్లో గ్రామం నుంచి రాజీవ్ రహదారి వరకు ప్రైవేట్ వాహనంలో వెళ్లాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

\- భాగ్యలక్ష్మి, గాగిల్లాపూర్ గ్రామస్థురాలు

సమాచారం

సూర్య నమస్కారాల బృందానికి టీ షర్ట్స్ అందజేత

గజ్వేల్, సెప్టెంబరు 15: గజ్వేల్ పట్టణంలోని సూర్య నమస్కారాల బృందం సభ్యులకు ఆదివారం వ్యాపారవేత్త కల్లూరు అశోక్‌గుప్తా ఆధ్వర్యంలో టీషర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో అశోక్‌గుప్తాను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని, ప్రతి ఒక్కరూ వ్యాయామం, నడక అలవర్చుకోవాలన్నారు. సుమారు పదేళ్లుగా సూర్య నమస్కార బృందం సభ్యులు వ్యాయామం, కాలినడక, తదితర చేసి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. సుమారు 50 మంది వరకు నిత్యం గజ్వేల్‌లో వివిధ ప్రాంతాల్లో నివసించే సూర్య నమస్కారం బృందం సభ్యులు ముట్రాజ్‌పల్లి రోడ్డులో ఉన్న మహిళా భవనం వద్ద గల ఓపెన్ జిమ్ వద్ద సూర్య నమస్కారాలు చేపడుతున్నామన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మద్దూరు, సెప్టెంబరు 15: మద్దూరు ఉమ్మడి మండలంలోని కూటిగల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన అటెండర్ బాలయ్య సతీమణి సుగుణమ్మ మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న పూర్వ ఉపాధ్యాయ బృందం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రాధానోపాధ్యాయులు శాగ కైలాసం, శ్రీధర్, జనగామ డీఈవో కార్యాలయ సత్తయ్య సీహెచ్ సుజాత, శ్వేత పాల్గొన్నారు.

యాదగిరికి ద బెస్ట్ ఎడ్యుకేటర్ అండ్ కరస్పాండెంట్ అవార్డు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 15: సిద్దిపేటలోని డీఎస్‌ఎం హైస్కూల్ స్థాపించి 33 ఏళ్ల అనుభవంతో ఎన్నో సేవలందిస్తున్న సిద్దిపేట పట్టణానికి చెందిన మిద్దె యాదగిరి ఆదివారం హైదరాబాద్‌లో ద బెస్ట్ ఎడ్యుకేటర్ అండ్ కరస్పాండెంట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ముమ్ముందు ఉత్సాహంతో పనిచేసేందుకు ఇటువంటి ప్రోత్సాహకాలు ఉపయోగపడతాయన్నారు.

మునిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా మల్లిక

మునిపల్లి: మునిపల్లి మోడల్ స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్‌గా మల్లిక ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన భాస్కర్‌రెడ్డి హత్నూర మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయనస్థానంలో వట్‌పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మల్లిక బదిలీపై వచ్చారు.

బస్సుల పునరుద్ధరణకు పోలీసుల చర్యలు

- రామారం రోడ్డును పరిశీలించిన సీఐ, డిపో అధికారులు



రాయపోల్ మండలం రామారం రోడ్డును పరిశీలిస్తున్న సీఐ లతీఫ్, ఎస్ఐ రఘుపతి

రాయపోల్, సెప్టెంబరు 15: రాయపోల్ మండలం రామారం, గొల్లపల్లి, సయ్యద్‌నగర్ గ్రామాల విద్యార్థులు ప్రజలు రెండురోజుల క్రితం బస్సుల కోసం ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు ఇచ్చిన హామీ మేరకు ఆదివారం తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్‌శర్మ, ఏడీఎం బాబూనాయక్, సంబంధిత కాంట్రాక్టర్‌తో కలిసి రోడ్డును పరిశీలించారు. గుంతలు, మూలమలుపులు ఉన్నచోట రెండురోజుల్లో కంకర వేసి బస్సు ప్రయాణానికి అనుకూలంగా తయారు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మూడు రోజుల్లోగా బస్సులను పునరుద్ధరిస్తామని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

అనాజీపూర్ బస్సు కోసం విజ్ఞప్తి

విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉదయం 9 గంటలకు మంతూర్, అనాజీపూర్ నుంచి గజ్వేల్‌కు తిరిగి సాయంత్రం 5 గంటలకు గజ్వేల్ నుంచి మంతూర్ వరకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని గజ్వేల్ డిపో మేనేజర్ పవన్‌శర్మకు బీజేపీ మండలాధ్యక్షుడు రాజాగౌడ్, మండల కార్యదర్శి నీల స్వామి, మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డితో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సిద్దిపేట టౌన్: రోగులకు టూత్‌పేస్టు, మందులను పంపిణీ చేస్తున్న మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్/సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 15: దంతాలను సంరక్షించుకోవాలని, ఎప్పటికప్పుడు దంత పరీక్షలు జరిపించుకోవాలని సిద్దిపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజులరాజనర్సు తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్‌లో శ్రీ నీలకంఠ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏదైనా సమస్య ఏర్పడితే భరించలేనంత నొప్పి ఉంటుందని చెప్పారు. అనంతరం దంత వైద్య శిబిరానికి సద్వినియోగం చేసుకున్న వార్డు ప్రజలకు ఉచితంగా పేస్టు, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు, దంత వైద్యుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేటలోని 20వ వార్డులో కౌన్సిలర్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వార్డు మహిళల కోసం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్.సింధూరి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటిచూపు మానవాళికి ఎంతో ముఖ్యమైనదని ఐ స్పెషలిస్ట్ డాక్టర్ మమత, బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

'సామాజిక బహిష్కరణ చేసిన వారిని అరెస్టు చేయాలి'

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15: డప్పు కొట్టమన్నందుకు సామాజిక బహిష్కరణ చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజిగూడ గ్రామానికి చెందిన యువకులు ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాలు చేస్తున్నామని చంద్రం, అర్జున్ డప్పులు కొట్టమని అన్నందుకు గ్రామ పెత్తందారులు వారిని సామాజిక బహిష్కరణ చేయడం దారుణమన్నారు. ఉన్నత విద్యలో గోల్డ్ మెడల్ సాధించినా వారికి కుల వివక్ష తప్పలేదన్నారు. సామాజిక బహిష్కరణ చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని మాణిక్యం ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్స్ నిషేధం

- అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

కోహెడ, సెప్టెంబరు 15: కోహెడ మండలంలో సోమ, మంగళవారం జరిగే వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్స్‌పై నిషేధం ఉన్నదని ఎస్ఐ పీ.అభిలాష్ తెలిపారు. ఈ సందర్భంగా కోహెడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక నిమజ్జనం మండలి నిర్వాహక కమిటీ డీజే సౌండ్స్ ఉపయోగించొద్దని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం రోజున మద్యం తాగి అల్లర్లకు పాల్పడి ప్రశాంతతను దెబ్బతీసిన వారిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. డీజే ఆపరేటర్లు కూడా కోహెడ మండలంలోని వినాయక నిమజ్జనాల్లో డీజేలు పెట్టొద్దని తెలిపినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ మంత్రుల కమిటీని రద్దు చేయాలి

- వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య



గ్రామ కమిటీ నియామకపత్రాన్ని అందజేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 15: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటీ వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని సమితి భావిస్తోందన్నారు. ఏకపక్షంగా ఉన్న మంత్రుల కమిటీతో తెలంగాణలో మాల, మాల ఉపకులాలకు ఏమాత్రం న్యాయం జరగదన్నారు. ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియస్తారని ప్రశ్నించారు. వెంటనే ఈ మంత్రుల కమిటీని రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ర్యాకం శ్రీరాములు, కోదాడి శ్రీనివాస్, సిద్దిపేట రూరల్ మండల కన్వీనర్ కొదది మురళి, గ్రామ గౌరవ అధ్యక్షుడు బొర్ర బాలయ్య, అధ్యక్షుడు కొదది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్రతం, సుదర్శన హోమానికి రావాలని ఎంపీకి ఆహ్వానం

రాయపోల్, సెప్టెంబరు 15: రాయపోల్ మండలం ఎల్కల్‌లో ఈ నెల 17న అనంత పద్మనాభస్వామి వ్రతం, సుదర్శన హోమం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు రావాలని ఆహ్వాన పత్రికను ఆదివారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు గ్రామస్థులు, నాయకులు అందజేశారు. ఉత్సవంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజాగౌడ్, ప్రసాద్, కుమార్, బాలమల్లు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

'ఏచూరి'కి ఘన నివాళులు

చేర్యాల, సెప్టెంబరు 15: మండలంలోని అయినాపూర్ గ్రామంలో సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడారు. సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవీందర్, ఇస్తారి, సాయిలు, యాదగిరి, చంద్రయ్య, బాలనారాయణ, ఉప్పలయ్య, కిషన్, రవి పాల్గొన్నారు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

వర్గల్, సెప్టెంబరు 15: కాంగ్రెస్ వర్గల్ మండల నాయకులు ఆదివారం మాజీ ఎంపీపీ మోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గం పరిస్థితులపై ఎమ్మెల్సీకి మోహన్ వివరించారు. అనంతరం ఎమ్మెల్సీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కీసర వెంకటేష్, మాజీ ఎంపీటీసీ నీల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సహదేవ్, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు తాళ్ల భాను ప్రసాద్‌గౌడ్, నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారానికి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్/చేర్యాల, సెప్టెంబరు 15: తెలంగాణలో మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ మేరకు వాహనాలను పూజల హరికృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నాయకులు బొమ్మల యాదగిరి, ఆలకుంట మహేందర్, కలిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల నుంచి పట్టణ అధ్యక్షుడు మంజాల చిరంజీవులు, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీకాంత్, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, వెలుగుల దుర్గయ్య, అంబాల రాముగౌడ్, మామిడాల నాగరాజు, ఎండీ.జౌర్ వినీత్, బాల్‌రాజ్, బండి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లారు.

గణనాథుడిని దర్శించుకున్న ప్రముఖులు



హుస్నాబాద్: వైశ్య భవన్‌లోని గణేష్ మండపంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



గజ్వేల్: యంగ్‌స్టార్ యూత్ వద్ద గణేశుడిని దర్శించుకుంటున్న ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, సెప్టెంబరు 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో యంగ్‌స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశుడిని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆయనవెంట బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, ఉప్పల మధుసూదన్, సందీప్, బారు అరవింద్, యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన గణేశులను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

●**హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ ఛైర్‌పర్సన్ ఐలేని అనిత, మాజీ ఎంపీపీలు ఆకుల వెంకట్, మానస, మాజీ జడ్పీటీసీ భూక్య మంగా, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

●**కోహెడ:** మండల కేంద్రంలో విఘ్నేశ్వరుని మండపాల్లో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, మాజీ ఎంపీపీ కీర్తి, మాజీ జడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం మార్గం తిరుపతి సుజాత కుమార్తె రితిక సారి ఫంక్షన్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు.

●**చిన్నకోడూరు:** చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్ గ్రామంలో నెలకొల్పిన పలు గణనాథులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు.

●**చేర్యాల:** కొమురవెల్లి మల్లికార్జున ఆలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా చివరిరోజున స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో బాలజీ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మల్లికార్జున్ పాల్గొన్నారు. అలాగే చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో ఆదివారం మహిళలు భక్తిప్రపత్తులతో కుంభహారతులను సమర్పించారు.

●**కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడి వద్ద నంద కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

●**నంగునూరు:** నంగునూరు మండలం అక్కెనపల్లిలో యంగ్ రెబల్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

●**సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని గణపతి ఆలయం వద్ద బొమ్మరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 23 వంటకాలతో 3000 మందికి అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



మునిగడపలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

గంగమ్మ చెంతకు గణపయ్య

జగదేవ్‌పూర్/మిరుదొడ్డి, సెప్టెంబరు 15: మండలంలోని మునిగడపలో వినాయక నిమజ్జనం ఆదివారం వైభవంగా జరిగింది. మునిగడప శివాలయంలో తిలక్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు తొమ్మిదిరోజుల పాటు విశేష పూజలందుకున్నాడు. అనంతరం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. అలాగే మిరుదొడ్డి మండలం లింగుపల్లిలో గ్రామస్థులంతా కలిసి ఒకే గణపయ్యను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిదిరోజుల పూజలందుకున్న గణపయ్యను ఆదివారం గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్



గజ్వేల్ పట్టణం మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వేములఘాట్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం విద్యార్థులు, నంగునూరు మండలంలోని మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో 2009-10 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

\- గజ్వేల్/నంగునూరు

నంగునూరు

